క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు పోల్స్ మారుస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని భాగ్యనగర్ విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మోర్ సూపర్ మార్కెట్ వెనుక రోడ్డు, సమతానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం బీజేపీ కన్వీనర్ శ్రీకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి ఈ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీరుస్తున్నామని అన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 9గంటల వరకు చలివేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కాకతీయనగర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాలనీ సంక్షేమ సంఘం అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని వినతిపత్రం సమర్పించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సీసీ కెమెరాల ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానన్నారు. తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మూసాపేట: మూసాపేట రైల్వే గూడ్స్ షెడ్‌లో కోరమండల్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్ ఎరువుల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివియన్ శేషుకుమార్ రీజనల్ లాజిస్టిక్ మేనేజర్, కె. వెంకటేశ్వర్లు జోనల్ మేనేజర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పేరుతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇంపాక్ట్ గురు ఫౌండేషన్ సమక్షంలో సుమారు 350 మంది పాల్గొన్నారని, బీపీ, షుగర్, జనరల్ చికిత్సలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డివిజనల్ హెడ్ అగ్రోనమిస్ట్, టీవీ చంద్రకాంత్, సీజీఎస్‌ఆర్ గూడ్స్ షెడ్ రోడ్డు, మార్కెటింగ్ ఆఫీసర్‌లు డీవీఎల్‌ఎస్ రాజు, శ్రీకాంత్, సుదర్శన్, సీనియర్ అగ్రోనమిస్ట్ ప్రసాద్, లాజిస్టిక్ ఆఫీసర్ అశోక్, అవేజ్ లిమిటెడ్ మూసాపేట బ్రాంచ్ మేనేజర్ నాయకుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రభారతి విద్యార్థుల స్నాతకోత్సవం



రవీంద్రభారతిలో జరిగిన స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొన్న సివిల్ అడ్వకేట్ కోమలత

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని రవీంద్రభారతి స్కూలులో ఆదివారం చిన్నారుల స్నాతకోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సివిల్ అడ్వకేట్ కోమలత విచ్చేశారు. విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే ఈ మహత్తర కార్యక్రమాన్ని చిన్నారుల స్థాయిలోనే నిర్వహించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పటిష్టం చేయాలనే తలంపు అభినందనీయమని ప్రశంసించారు. ఈ సందర్భంగా కోమలత చేతుల మీదుగా విద్యార్థులకు యూకేజీ పట్టాలను ప్రదానం చేశారు. తమ పిల్లలకు జరుగుతున్న అద్భుతమైన సత్కారాన్ని వీక్షించి తల్లిదండ్రులు మురిసిపోయారు. అనంతరం కోమలత మాట్లాడుతూ.. విద్యాపరంగా పిల్లలను ప్రోత్సహించి వారి స్థాయిని పెంచుతూ వారిలోని అద్భుతమైన ప్రతిభను గుర్తించి సన్మానించిన రవీంద్ర భారతి విద్యా సంస్థలను కొనియాడారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాల ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలుష్యకాసారంగా చెరువు

- మురుగు చేరడంతో దుర్వాసన
- సుందరీకరణకు నోచుకోని వైనం





చెత్తా చెదారం, గుర్రపు డెక్కతో మురికి కూపంగా మారిన ఎల్లమ్మ చెరువు

భాగ్యనగర్‌కాలనీ: చెరువుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పదేపదే చెబుతున్న ప్రజాప్రతినిధుల మాటలు నీటి మీద రాతల్లాగే ఉంటున్నాయి. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువులో తాత్కాలికంగా గుర్రపుడెక్క తొలగించారు. దీనికి తోడు కాలనీ నుంచి మురుగు చెరువులో కలుస్తుండటంతో నీరంతా కలుషితమవుతోంది. దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దోమలు ఆవాసంగా మార్చుకొని కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఎల్లమ్మ చెరువును సుందరీకరిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రగల్భాలు పలకటమే తప్ప సుందరీకరణ మాట దేవుడెరుగు.

◆ ఎల్లమ్మ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. ఇళ్లలో నుంచి వచ్చే డ్రైనేజీ మురుగు అడ్డుకట్ట వేయటంతో అధికారులు విఫలమవుతున్నారు. ఈ చెరువు చుట్టూ కాలనీలు ఉన్నాయి. అయితే కొంత మంది డ్రైనేజీ లైన్ ఉన్నప్పటికి ఆ మార్గంగా డ్రైనేజీ నీటిని తరలించకుండా చెరువులోకి వదులుతున్నారు. దీంతో చెరువు పూర్తిగా కలుషితమై అధ్వానంగా మారింది. ఎల్లమ్మ చెరువు ఉషాముళ్లపూడి రోడ్డుకు ఆనుకొని ఉంది. చెరువును సుందరీకరించి అభివృద్ధి చేస్తే ఎంతోమంది పర్యాటకులు వచ్చి పర్యాటక ప్రాంతంగా మారే అవకాశం ఉంది.

ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యం..

ప్రభుత్వాలు మారినా ఎన్నో ఏళ్లుగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో ఉన్న ఎల్లమ్మ చెరువు సుందరీకరించటంలో ఇటు ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే మురుగు చెరువులోకి వదులుతున్నారని.. పలువురు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. చెరువులను పరిరక్షిస్తున్నామని ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా అభివృద్ధి సుందరీకరణకు మోక్షం కలగటం లేదని స్థానికులు మండిపడుతున్నారు. చెరువులను సుందరీకరించి మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామన్న ప్రభుత్వ హామీలు ఆచరణలో అమలు కావటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెరువును సుందరీకరించాలి..



ఎల్లమ్మ చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయి.. కాలనీల నుంచి మురుగు చేరడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఈ వాసన భరించలేకపోతున్నాం. చెరువు సుందరీకణను అటుంచితే కనీసం గుర్రపుడెక్క, మురుగు చేరకుండా చర్యలు తీసుకోవడం లేదు. దోమలు వృద్ధి చెంది ఉదయం, సాయంత్రం వేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా చెరువును సుందరీకరించాలి.

– పవన్, జయానగర్‌కాలనీ

మూడేళ్ల ముందు దరఖాస్తు

మూడు నెలల కింద ప్రారంభం

- భవన నిర్మాణం మరూ కాక ముందే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు
- మూసాపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల మాయాలీల!





బాలాజీనగర్ డివిజన్‌లోని ధనలక్ష్మి సెంటర్ సమీపంలో నిర్మిస్తున్న బిల్డింగ్

కూకట్‌పల్లి: ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా తయారైంది కూకట్‌పల్లి జోన్ టౌన్ ప్లాన్ పరిస్థితి. బిల్డింగ్ నిర్మాణం ప్రారంభం కాకముందే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం నిర్మాణదారుడు దరఖాస్తు చేసుకున్న ఉదంతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మూసాపేట సర్కిల్ బాలాజీనగర్ డివిజన్‌లో ఓ నిర్మాణదారుడు తన 260 గజాల స్థలంలో నిర్మాణం కోసం 2017లో దరఖాస్తు చేసుకున్నారు. దీనికి 2018 జనవరిలో అతనికి అనుమతి ఇచ్చారు. ఇక్కడ భవన నిర్మాణం ప్రారంభం కాకముందే 2019 డిసెంబర్ 15వ తేదీన తన భవనం పూర్తనట్లు ఆర్కిటెక్చర్ ద్వారా 2020 మే 20వ తేదీన సర్టిఫికెట్ ఇచ్చినట్లు దరఖాస్తు చేసుకున్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీలోని ధనలక్ష్మి సెంటర్ సమీపంలో ఎంఐజీ 180లో నిర్మించే ఈ భవనం ఇప్పటి వరకు ఇక్కడ చేపట్టారా? నిర్మాణానికి సంబంధించి వివరాలను తీసుకున్నారా? అనేది ఏ ఒక్క అధికారి స్పందించడం లేదు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఉపకమిషనర్‌ను వివరణ కోరగా ఈ దరఖాస్తుతో తమకు సంబంధం లేదని దాటవేస్తున్నారు. స్థానికంగా భవన నిర్మాణాలను ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ చేసే టీపీఎస్ అధికారి ప్రతి రోజూ ఈ భవనం వద్దకు వెళ్లొచ్చే వారని స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఇక్కడ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేసే అధికారి అక్రమ నిర్మాణాలన్నిటిని సక్రమ నిర్మాణాలుగా తీర్చిదిద్దడంలో దిట్ట అని అంటున్నారు.

– సామాన్యుడు వెళితే సవాలక్ష షరతులతో సమాధానమిచ్చే ఈ అధికారి చేయి తడిపితే చాలు షరతులన్నీ చెత్త బుట్టలోకి వెళ్లిపోతాయని స్థానికులు పేర్కొంటున్నారు. సామాన్యుడు ఫిర్యాదు చేస్తే కోర్టుల పేరుతో, తనిఖీల పేరుతో కాలం గడిపి అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్నారని అంటున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఈ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న సిబ్బందిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం..



టీఎస్‌బీపాస్‌కు వచ్చిన తరువాత అనుమతులివ్వడంలో.. దరఖాస్తులు తీసుకోవడంలో తమ పాత్ర ఏమి ఉండటం లేదు. ఎప్పుడో పాత అనుమతికి కట్టక ముందే దరఖాస్తు చేసుకోవటం తప్పిదమే. క్షేత్రస్థాయిలో పర్యటన చేసే అధికారులు ప్రతి ఒక్కటి గమనించాల్సి ఉంటుంది. ఈ విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారుల వివరణ తీసుకున్న తరువాత శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కె.రవికుమార్, ఉపకమిషనర్

దివ్యాంగులకు చేస్తున్న సేవలు అమోఘం



నారీశక్తి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె. వాసుదేవరెడ్డి, కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: సాధారణ విద్యార్థులకు బోధించడం మాములు విషయమే కానీ దివ్యాంగులుగా ఉన్నవారికి సపర్యలు చేయడంతో పాటు విద్యను బోధించడం మాములు విషయం కాదని అటువంటి గణమాస్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అమోఘమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ రాధాకృష్ణనగర్‌లోని గణమాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పెల్ స్కూల్ నారీశక్తి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులను మనలో ఒకరిగా చూసుకోవాలే తప్ప ప్రత్యేకంగా చూడవద్దని సూచించారు. అదే విధంగా గణమాస్ ఫౌండేషన్ ద్వారా అల్లికలు నేర్పించటం ఎంతో గొప్ప విషయమన్నారు. గణమాస్ ఫౌండేషన్‌కు తన శాయశక్తులా ఎల్లప్పుడు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి మాట్లాడుతూ... అంగవైకల్యం మనిషికే గాని మనసుకు కాదని అన్నారు. అలాంటి వారికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. గణమాస్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సర్టిఫికెట్లు, నగదును బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, గంగపుత్ర గణమాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కళ్యాణి, మద్దినేని, నాయకులు వీరారెడ్డి, ఐలయ్య, భార్గవ్, శశిరెడ్డి, సునీత, రామకృష్ణ, రంగస్వామి, రామ్‌రెడ్డి, ఐజాక్, లాజరస్, జ్ఞానేశ్వర్, యోగిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రలేమి అనారోగ్యాలకు మూలం

కాంటినెంటల్ ఆస్పత్రిలో ప్రత్యేక నిద్రరుగ్మతల విభాగం ప్రారంభం

రాయదుర్గం: నిద్రలేమి అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మూలమని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురుఎన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ నిద్రాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నానక్‌రాంగూడ కాంటినెంటల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిద్రరుగ్మతల విభాగాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ జే.సి.సూరితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ జే.సీ.సూరి మాట్లాడుతూ నిద్రకు సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. నిద్ర రుగ్మతలపై అత్యాధునిక హంగులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ గురుఎన్‌రెడ్డి మాట్లాడుతూ కాంటినెంటల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో నిద్ర సంబంధిత రుగ్మతల నివారణకు చికిత్స అందిస్తామన్నారు. పల్మనాలజీ విభాగం అధిపతి డాక్టర్ నళిని నాగళ్ల మాట్లాడుతూ నిద్రలేమి, తత్సంబంధిత ఇబ్బందులు అన్ని రకాల అనారోగ్య లక్షణాలకు మూలమన్నారు. కార్యక్రమంలో కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యబృందం, పాల్గొన్నారు.



'మాదిగజాతి అభ్యున్నతికి నా వంతు కృషి చేస్తా'



మాదిగ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

బాలానగర్: మాదిగల అభివృద్ధి కోసం మాదిగ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఫతేనగర్‌లోని ఎల్‌బీఎస్ నగర్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా జి. సతీష్‌రానాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ రానా మాట్లాడుతూ.. తన మీద నమ్మకంతో డివిజన్‌లో ఉన్నటువంటి దాదాపు 500 మంది సమావేశంలో పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మాదిగజాతి అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చైర్మన్‌గా కిషన్, ప్రధాన కార్యదర్శిగా వంగల యాదగిరి, ఉపాధ్యక్షులుగా శివ, చీటకోరు నరేష్, టి. హరిబాబు, జాంగీర్ బాబు, సెక్రటరీగా మద్దూరి సందీప్, జాయింట్ సెక్రటరీలుగా బాలరాజు, రవి కుమార్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, శ్యాం కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వినోద్‌కుమార్, కాళిదాస్, బన్నీ, అడ్వైయిజర్లు ఎం.సోమేశ్‌కుమార్, జి. సదానంద్, బి. రాములు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా గట్టగళ్ల వెంకటేష్, రాజులు ఎన్నుకున్నారు.

తొమ్మిదేళ్లలో ఎన్నో విజయాలు సాధించాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఘనంగా కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన ఎమ్మెల్సీలు పల్లా, రాజు, నవీన్‌కుమార్
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. చిత్రంలో ఎమ్మెల్సీలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సభ ఆదివారం కేపీహెచ్‌బీ కమ్యూనిటీహాల్‌లో జరిగింది. ఈ సభకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, నియోజవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు సైతం పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఎన్నో విజయాలు సాధించామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిరుపేదలు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 1లక్ష 116 రూపాయలు అందించడటం దేశంలో ఎక్కడా లేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఈ పథకాలు అందిస్తున్నారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ సైనికులు అందరూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా చేయాలన్నారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా ఉండేదో.. ఇప్పుడు ఎలా ఉందో వివరించాలన్నారు.

ఆలయాలు నిర్మిస్తూ ధర్మాన్ని కాపాడుతున్నాం..

మన ధర్మాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలో సొంత నిధులు వెచ్చించి దాతల సహకారంతో 450 ఏళ్ల చరిత్ర గల రామాలయాన్ని, ఫతేనగర్‌లో శివాలయాన్ని, మూసాపేటలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నామని అన్నారు. ఎంతసేపూ కులం, మతం అని పబ్బం గడుపుకునే బీజేపీ నేతలు ఏనాడైనా వచ్చి కనీసం భగవంతుని దర్శనం చేసుకున్నారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో బీజేపీ నాయకులు ఎన్ని గుళ్లు కట్టించారో చెప్పాలని సవాల్ విసిరారు.

24గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం..

పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధికి ఎక్కడా రాజీ పడకుండా రాష్ట్రాన్ని అనేక సంక్షేమ పథకాలతో ముందుకెళ్తున్నారని అన్నారు. రైతులకు 24గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తూ వారికి రైతుబీమా, రైతుబంధు పథకాలను అందించి అండగా ఉంటున్నారని అన్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే కృష్ణారావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత ఉంటే కూకట్‌పల్లి నియోజకవర్గానికి వెంటనే నిధులు కేటాయించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కి తెలియపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలానగర్, కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన 200 మంది, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేపీ హెచ్‌బీ మ్యూనిటీహాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళన సభకు హాజరైన కార్యకర్తులు

నియోజకవర్గ ప్రజలే నా బలగం

- బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలే నా బలం
- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో ఆదివారం అశోక్ గార్డెన్స్‌లో జరిగిన వివేకానందనగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ ఎల్. రమణ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ చేసిన ఎన్నో ఉద్యమాలు పోరాటాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని అన్నారు. సాధించుకున్న రాష్ట్రంలో రెండుసార్లు అధికారం చేపట్టి తెలంగాణ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. పరిపాలనా విషయంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం దిక్సూచిగా మారిందన్నారు. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. తప్పుడు కథనాలు సృష్టించే ప్రతిపక్ష పార్టీల నాయకుల దుశ్చర్యలను తిప్పి కొట్టే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే పార్టీ మాదే..

ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి చేరే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎనిమిదేళ్లలో ఏమి చేశామమో.. రాబోయే రోజులలో ఏం చేయబోతున్నామనేది ప్రజలకు వివరించాలని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే పార్టీ కేవలం బీఆర్‌ఎస్ పార్టీ అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తని కంటికి రెప్పలా చూసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో పదవులు పొందిన వారు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలే నా బలగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ సభ్యులు, బస్తీ అధ్యక్షులు, మహిళా నాయకులు, పార్టీ ప్రధాన, అనుబంధ కమిటీలు, బస్తీ కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

